## క్లుప్తంగా

### ఓంకారేశ్వరున్ని దర్శించుకున్న రాచమల్లు



ఓంకారేశ్వరుని సన్నిధిలో కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

**ప్రొద్దుటూరు :** మధ్యప్రదేశ్‌ రాష్ట్రంలోని ప్రముఖ ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన నర్మద తీరన వెలసిన ఓంకారేశ్వరుని బుధవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి, కుమార్తె రాచమల్లు కావ్య దర్శించుకున్నారు. వారు స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు వారికి తీర్థ ప్రసాదాలు అందించారు. అలాగే ఇండర్‌లోని కర్జాన గణేష్‌ మందిర్‌లో స్వామి వారికి ఎమ్మెల్యే రాచమల్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### ఎనర్జీ అసిస్టెంట్‌ నియామకం ఎప్పుడు?

**గోపవరం :** మండల కేంద్రమైన గోపవరం గ్రామ పంచాయతీకి ఎనర్జీ అసిస్టెంట్‌ ఎక్కడ అని స్థానికులు సంబంధిత అధికారులను ప్రశ్నిస్తున్నారు. ప్రతి సచివాలయానికి ఒక ఎనర్జీ అసిస్టెంట్‌ను ప్రభుత్వం నియమించింది. అయితే గోపవరం సచివాలయానికి అప్పట్లో ఎనర్జీ అసిస్టెంట్‌ నియామకం జరగలేదు. అప్పటి నుంచి పోస్టు ఖాళీగా ఉంది. కనీసం పక్క సచివాలయం నుంచి ఇన్‌చార్జిగా అయినా నియమించమని అనేకమార్లు స్థానికులు ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్‌ సుధలకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ఎనర్జీ అసిస్టెంట్‌ను ఏర్పాటు చేయాలని ఏఈ, డీఈలతో చెప్పినా ప్రయోజనం లేదు. మేజర్‌ గ్రామ పంచాయతీ అయిన గోపవరంలో ఎనర్జీ అసిస్టెంట్‌ లేకపోవడంతో అటు వినియోగదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**గాయపడ్డ ఎనర్జీ అసిస్టెంట్‌**

మండలంలోని టి.సండ్రపల్లె ఎనర్జీ అసిస్టెంట్‌ పెంచలయ్య విధి నిర్వహణలో విద్యుత్‌ స్తంభంపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. పి.పి.కుంటలో విద్యుత్‌ సమస్య ఉందని, సంబంధిత లైన్‌ మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఏఈ చెప్పడంతో బుధవారం స్తంభం ఎక్కి లైన్‌ మరమ్మతులు చేస్తుండగా పెద్దలైన్‌ తాకడంతో ఒక్కసారిగా పైనుంచి కిందపడ్డాడు. దీంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే గాయపడిన ఎనర్జీ అసిస్టెంట్‌ పెంచలయ్యకు బద్వేలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి అక్కడి నుంచి కడపకు తరలించారు.

### తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి



ద్విచక్ర వాహనాన్ని అందజేస్తున్న రమణారెడ్డి

**రాజుపాళెం :** రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని కోరమాండల్‌ జోనల్‌ మేనేజర్‌ ఎల్‌వీ రమణారెడ్డి తెలిపారు. మండలంలోని కొర్రపాడు గ్రామంలో బుధవారం సాయంత్రం కోరమాండర్‌ ఇంటర్నేషనల్‌ లిమిటెడ్‌ ప్రతినిధులు రైతు సంబరాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం డ్రా పద్దతిలో విజేతలుగా నిలిచిన ముగ్గురు రైతులకు టీవీఎస్‌ కంపెనీకి చెందిన ద్విచక్ర వాహనాలను బహుమతులుగా అందజేశారు. నరసింహారెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

### యువరైతు ఆత్మహత్య



ప్రవీణ్‌కుమార్‌ (ఫైల్‌)

**బ్రహ్మంగారిమఠం :** మండలంలోని చౌదరవారిపల్లె ఎస్సీకాలనీలో మంగళవారం విషాదం నెలకొంది. ఎస్సీకాలనీకి చెందిన మాగిపోగు దేవరాజు కుమారుడు మాగిపోగు ప్రవీణ్‌కుమార్‌ (33) వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు ప్రవీణ్‌ కుమార్‌ను కడపలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో తిరుపతికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు వేడుకున్నారు.

### విజిలెన్స్‌ అధికారుల తనిఖీ

**ప్రొద్దుటూరు క్రైం :** కొత్తపల్లె పంచాయతీ పరిధిలో విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు బుధవారం రాజరాజేశ్వరి కాలనీలో ఉన్న ఓ నన్నారి షరబత్‌ తయారీ కేంద్రంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. స్టాంపింగ్‌ లేని తూకపు రాళ్లు, ప్యాకింగ్‌ లైసెన్స్‌ లేకుండా వ్యాపారం చేయడంతో రూ. 25 వేలు జరిమానా విధించినట్లు విజిలెన్స్‌ అధికారి ఐదురుబాషా తెలిపారు. అంతే కాకుండా వాణిజ్య అవసరాల కోసం ఉపయోగిస్తున్న 7 గృహ అవసర గ్యాస్‌ సిలిండర్లను సీజ్‌ చేసి షాపు యజమానిపై కేసు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో విజిలెన్స్‌ అధికారులు రెడ్డప్ప, బాల గంగాధర్‌రెడ్డి, జి.శ్రీనివాసులు, ఎస్‌ ఖాజాహుస్సేన్‌, బి గీతావాణి, బి బాబు మోజెస్‌, మూడే హరిత, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం



మైదుకూరు: మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశులు



అట్లూరు: కమలకూరు గ్రామస్తులతో మట్లాడుతున్న అట్లూరు, బద్వేలు రూరల్‌ ఎస్‌ఐలు

**మైదుకూరు :** శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయమని మైదుకూరు డీఎస్పీ టి.వెంకటేశులు ప్రకటించారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల రోజున అసాంఘిక కార్యకలాపాలు కానీ, హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం స్థానిక అర్బన్‌ పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జూన్‌ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్‌ అమలులో ఉంటుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు రోజున శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని సూచించారు. 144 సెక్షన్‌ అమలులో ఉందని, నలుగురికి మించి సంచరించ వద్దని పేర్కొన్నారు. కౌంటింగ్‌ రోజున గ్రామాల నుంచి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఇతర వ్యక్తులు మైదుకూరుకు రావద్దని సూచించారు. 30 పోలీస్‌ యాక్ట్‌ అమలులో ఉందని, ఎవరు అల్లర్లకు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిలిస్తే రౌడీషీట్‌ ఓపెన్‌ చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో అర్బన్‌ సీఐ ఏపీ మస్తాన్‌, ఎస్‌ఐ మద్దిలేటి పాల్గొన్నారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**అట్లూరు :** ఎన్నికల కోడ్‌ అమలులో ఉన్నందున నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అట్లూరు ఎస్‌ఐ కె.సి. రాజు, బద్వేలు రూరల్‌ ఎస్‌ఐ రవికుమార్‌ హెచ్చరించారు. బుధవారం అట్లూరు మండల పరిదిలోని కమలకూరు, బద్వేలు మండల పరిధిలోని ఉప్పతివారిపల్లి గ్రామాలలో నాకాబంది నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయా గ్రామాలలో వీధులు, గడ్డివాములలో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రేపు నెల 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్‌ అమలులో ఉంటుందని, ఎన్నికల పలితాల తర్వాత బాణాసంచా పేల్చడం, అల్లర్లుకు పాల్పడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు రూరల్‌, అట్లూరు పోలీసులు పాల్గొన్నారు.

**అల్లర్లు సృష్టిస్తే చర్యలు**

**పోరుమామిళ్ల :** ఎన్నికల ఫలితాల అనంతరం అందరూ శాంతియుతంగా ఉండాలని, ఎలాంటి అల్లర్లు సృష్టించవద్దని సీఐ చిరంజీవి, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. బుధవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్‌ఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం ఎవరూ అల్లర్లకు పాల్పడవద్దని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్‌ అమలులో ఉందని విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని సూచించారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



పోరుమామిళ్ల : మాట్లాడుతున్న పోలీస్‌ అధికారులు

**వెలవలిలో నాకా బందీ**

**రాజుపాళెం :** మండలంలోని వెలవలి గ్రామంలో బుధవారం ప్రొద్దుటూరు రూరల్‌ సీఐ రమణారెడ్డి, రాజుపాళెం ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్‌ సిబ్బందితో నాకా బందీ నిర్వహించారు. ముందుగా కల్లాలు, గడ్డి వాములు, ఇళ్లల్లో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం గ్రామస్తులతో సీఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ ముగిసేంత వరకు ఎటువంటి గొడవలు చేసుకోకుండా ప్రశాంతంగా ఉండాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించందుకు కృషి చేస్తామని తెలిపారు. చిన్న సమస్యలకు గొడవలు పెట్టుకుంటే, అటువంటి వారిపై నాన్‌బెయిలబుల్‌ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సిద్ధయ్య, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

**బద్వేలు అర్బన్‌ :** ఆయా పంచాయతీల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మండల పరిషత్‌ అధ్యక్షురాలు బిజివేముల రమణమ్మ అధికారులను కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ త్వరలో రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మండల పరిధిలోని ఆయా జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు త్వరితగతిన బిల్లులు మంజూరయ్యేలా చూడాలని హౌసింగ్‌ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్‌ అధికారులను కోరారు. ప్రతి పంచాయతీలో వైద్యశిబిరాలు నిర్వహించడంతో పాటు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని, అలాగే ఆరోగ్యశ్రీ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం అజెండాలోని వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, ఎంపీడీఓ రజనీకాంత్‌, మండల పరిషత్‌ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో ఆప్షన్‌ మెంబర్‌, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమణమ్మ

## బాల సాహిత్యం విజ్ఞానానికి సోపానం

**ప్రొద్దుటూరు :** పిల్లలు పుస్తకాలను అవగాహన చేసుకుంటూ చదవాలని, బాలసాహిత్యం విజ్ఞానానికి సోపానమని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డీకే చదువుల బాబు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పుట్టపర్తి నారాయణాచార్య ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలు చదవడం వలన మంచి చెడు విచక్షణ, నైతిక విలువలు, లక్ష్యసాధన లక్షణాలు పెంపొందుతాయని చెప్పారు. పిల్లల మానసిక పరిపక్వతకు పుస్తకాలు తోడ్పడుతాయని చెప్పారు. నమ్మకం, ఎలుగుబంటి – సింహం కథలను ఉదాహరణలతో సవివరంగా విద్యార్థులకు తెలిపారు. స్పోకెన్‌ ఇంగ్లిష్‌ మాస్టర్‌ పవన్‌కల్యాణ్‌ విద్యార్థులతో ఇంగ్లీష్‌ కన్వర్జేషన్‌ను ప్రాక్టీస్‌ చేయించారు. ఈ కార్యకర్మంలో గ్రంథాలయ అధికారి తిరుపతమ్మ, హెల్పర్‌ నాగలక్ష్మిదేవి, చంద్రశేఖర్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీకే చదువులబాబు

## దివ్యాంగ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

**మైదుకూరు :** బడిబయట ఉన్న దివ్యాంగ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో, భవిత కేంద్రాల్లో చేర్పించాలని ఐఈఆర్‌పీడబ్ల్యూ ఆదిలక్ష్మి, రత్నప్రసాద్‌ తెలిపారు. విద్యాశాఖ చేపట్టిన దివ్యాంగ పిల్లల సర్వే నమోదులో భాగంగా వారు మైదుకూరు మండలంలో 1 నుంచి 18 ఏళ్లలోపు దివ్యాంగ పిల్లలను గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుద్ధిమాంద్యత, వినికిడి లోపం, సెరిబ్రల్‌ పాల్సీ, దృష్టిలోపం, డౌన్‌సిండ్రోమ్‌, లోకోమోటర్‌ తదితర 21 రకాల వైకల్యాలను గుర్తించి వారిని భవిత కేంద్రాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తామని తెలిపారు. ప్రభుత్వం సమగ్ర శిక్ష తరపున వారికి అన్ని రకాల అలవెన్స్‌లు, అవసరమైన ఉపకరణాలను అందిస్తుందని వివరించారు. జూన్‌ 9వ తేదీ వరకు ఈ సర్వే కొనసాగుతుందని తెలిపారు. మండలంలో ఎవరైనా దివ్యాంగ పిల్లలు ఉన్న వారు 9618436278, 7997404349 నంబర్లకు తెలియజేయాలని వారు కోరారు.

## విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

**ప్రొద్దుటూరు కల్చరల్‌ :** పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించనున్నట్లు తొగటవీర క్షత్రియ ఉద్యోగులు, వృత్తి నిపుణుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు ఈడెం లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ప్రతిభా పురస్కారాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొగటవీర క్షత్రియ విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 8 ఏళ్లుగా ప్రతిభా పురస్కారాలను అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ, మున్సిపల్‌, జిల్లాపరిషత్‌, ఎయిడెడ్‌ పాఠశాలల్లో చదివి మంచి మార్కులు సాధించిన తొగట విద్యార్థులు పురస్కారాలకు అర్హులన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.5,000. ద్వితీయ బహుమతిగా రూ.3,000, తృతీయ బహుమతిగా రూ.2,000 అందిస్తామన్నారు. జూన్‌ 9న ప్రతిభా పురస్కారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు గోవిందు రామమునయ్య, పల్లా శివనాగయ్య, బొలిశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

## ఇంటర్‌ విద్యార్థులకు మంచి విద్య

**రాజుపాళెం :** ఇంటర్‌ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించనున్నట్లు హెచ్‌ఎం వేలంగ్‌కుమార్‌ తెలిపారు. జూన్‌ 1 నుంచి రాజుపాళెంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఇంటర్‌ కో– ఎడ్యుకేషన్‌ విద్యను ప్రారంభిస్తున్నామని, మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఉపాధ్యాయ బృందంతో విద్యార్థులను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాజుపాళెంలో ఇంటర్‌ కళాశాలను ఏర్పాటు చేసిందని, పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా ప్రభుత్వ ఇంటర్‌ కళాశాలలో ప్రవేశం పొందాలన్నారు. పీజీ చేసిన ఉపాధ్యాయ బృందంతో మంచి బోధన అందిస్తామని, కళాశాలను కూడా అన్ని హంగులతో కూడిన భవనాలను నిర్మించినట్లు తెలిపారు. ఇంటర్‌లో కూడా మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని చెప్పారు.



విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం

### ఆధార్‌కార్డును అనుసంధానం చేసుకోవాలి

**బ్రహ్మంగారిమఠం :** బి.మఠంలోని సోమిరెడ్డిపల్లె సహకార పరపతి సంఘంలోని సభ్యులు ఆధార్‌ కార్డును అనుసంధానం చేసుకోవాలని సంఘం తాత్కాలిక అధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రుణాలు పొందిన రైతులు రెండు ఫొటోలు, ఆధార్‌తో బి.మఠంలోని సహకార పరపతి సంఘం కార్యాలయంలో అనుసంధానం చేయించుకోవాలన్నారు.

### గంగమ్మ తిరునాల వాయిదా

**మైదుకూరు :** మండలంలోని శివపురంలో ఈనెల 25వ తేదీ నుంచి జరగాల్సిన గ్రామ దేవత గంగమ్మ తిరుణాల అనివార్య కారణాల వలన వాయిదా వేసినట్లు సర్పంచ్‌ కొండా భాస్కర్‌రెడ్డి, గ్రామ పెద్దలు ఒక ప్రకటనలో తెలిపారు. తిరునాలను జూన్‌ నెలకు వాయిదా వేసినట్టు వారు పేర్కొన్నారు. భక్తులు, బండలాగుడు పోటీలకు వచ్చే వృషభరాజుల యజమానులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

### రాచాయపేటలో తాగునీటి సమస్య

**గోపవరం :** మండలంలోని రాచాయపేటలో తీవ్ర తాగునీటి సమస్య నెలకొంది. నెల రోజులుగా నీటి కోసం గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. రాచాయపేట ప్రధాన గ్రామానికి ఓవర్‌హెడ్‌ ట్యాంకు ద్వారా నీటి సరఫరా కొనసాగుతుంది. ట్యాంకుకు సంబంధించిన గేటువాల్‌ దెబ్బతిని నీరంతా వృధా పోతోంది. ఎస్సీకాలనీలో ఉన్న రెండు తాగునీటి పథకాలు పనిచేయకపోవడంతో నీటి సమస్య తీవ్రంగా ఉంది. స్థానికులు అనేకసార్లు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ విజయరామరాజు పదేపదే ఆదేశించినా ఫలితం లేకుండా పోయింది. జిల్లా కలెక్టర్‌ ఆదేశాలను ఆర్‌డబ్ల్యూఎస్‌ అధికారులు బేఖాతరు చేస్తూ కనీసం తాగునీటి సమస్య ఉన్న గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పదించాలని కోరారు.

### ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

**కాశినాయన :** అధికారులు ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం నరసాపురంలోని స్త్రీశక్తిభవనంలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజల సమస్యలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరికి ఉపాధి హామీ పనులు కల్పించాలని తెలిపారు. అనంతరం ఆయాశాఖల మండల స్థాయి అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్యఆచారి, ఆర్‌డబ్ల్యూఎస్‌, పీఆర్‌ ఏఈలు సందీప్‌, పుల్లయ్య, ఏఓ ప్రవీణ్‌కుమార్‌, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ చంద్రకళ, ఎంఈఓ నిర్మల, వైద్యాధికారి శరత్‌, హౌసింగ్‌ ఏఈ బాలిరెడ్డి, పశువైద్యాధికారి రామారావు పాల్గొన్నారు.

### క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం

**పోరుమామిళ్ల :** చేయి చేయి కలుపుదాం–క్షయ వ్యాధిని నిర్మూలిద్దామని మండల ఆరోగ్య విద్యాధికారి సాధు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. పోరుమామిళ్ల మండలంలోని అన్ని హెల్త్‌ క్లినిక్‌లలో గురువారం క్షయ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. దగ్గు క్రమం తప్పకుండా రెండు వారాల పాటు ఉంటే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్షయవ్యాధి నిర్ధారణ అయితే వెంటనే మందుల వాడకం ప్రారంభించాలన్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు, టీబీ మందులు వాడి తగ్గిన వారికి, టీబీ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు, 60 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ, బాడీ మాస్‌ ఇండెక్స్‌, 18 లోపు ఉన్నవారికి బీసీజీ టీకా ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు. అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

# వైభవంగా నరసింహస్వామి జయంతి

**ప్రొద్దుటూరు కల్చరల్‌ :** మండల పరిధిలోని నరసింహాపురంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున లక్ష్మీనరసింహాస్వామి మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. లోక కల్యాణార్థం గణపతి, నవగ్రహ, లక్ష్మీనరసింహ, సుందర్శన హోమాలను వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మండపంలో లక్ష్మీనరసింహాస్వామి వారిని కొలువు దీర్చి సుముహూర్తంలో వైభవంగా కల్యాణోత్సవాన్ని జరిపారు. సాయంత్రం లక్ష్మీనరసింహాస్వామి వారి గ్రామోత్సవం మంగళ వాయిద్యాలు, చెక్కభజనల మధ్య ఘనంగా నిర్వహించారు.



కల్యాణోత్సవంలో లక్ష్మీనరసింహాస్వామి

**రాజుపాళెం :** మండలంలోని వెల్లాలలో శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు వెంకటాచలపతి తెల్లవారుజామునే స్వామికి నూతన పట్టువస్త్రాలు సమర్పించి, కుంకుమార్చన, సహస్రనామార్చన, మంగళహారతితో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం లక్ష్మినరసింహస్వామిని ప్రత్యేకంగా అలకరించిన పల్లకిలో ఆశీనులు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఈఓ నరసయ్య, ఆలయ చైర్మన్‌, మాజీ చైర్మన్‌ జగదీశ్వరరెడ్డి, జనార్ధన్‌ రెడ్డి స్వామికి పూజలు చేశారు.



రాజుపాళెం: వెల్లాలలో నరసింహస్వామిని పల్లకిలో ఊరేగిస్తున్న చైర్మన్‌, ఈఓ, భక్తులు

**లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు**

**బి.కోడూరు :** మండలంలోని పాయలకుంట్ల పంచాయతీ ఎర్రిఓబన్నబావి సమీపాన కొండపై వెలసిన శ్రీనల్లగొండ లక్ష్మీనరసింహస్వామి 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా బుధవారం స్వామివారికి అభిషేకం ,ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం కోలాటం నిర్వహించారు.

## గజవాహనంపై ఊరేగిన అగస్త్యేశ్వరుడు

నేడు ఘనంగా రథోత్సవం

**ప్రొద్దుటూరు కల్చరల్‌ :** స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం గజవాహనంపై ఊరేగారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. సాయంత్రం గంగాగౌరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి గజవాహనంపై కొలవు దీర్చారు. విశేష పూజాకార్యక్రమాల అనంతరం పుర వీధుల్లో శివనామస్మరణల మధ్య ఊరేగించారు. దారివెంబడి భక్తులు కొబ్బరి కాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చి భక్తి శ్రద్ధలతో పూజించారు. కాగా గురువారం ఉదయం గంగాగౌరి సమేత అగస్త్యేశ్వర స్వామి గ్రామోత్సవం పురవీధుల్లో కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్‌ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు. ఆలయం నుంచి వెదుర్ల బజార్‌ మీదుగా మధ్యాహ్నం అమ్మవారిశాలకు చేరుకుందని, తిరిగి సాయంత్రం మెయిన్‌ బజార్‌, పప్పులబజార్‌, లైటుపాళెం సెంటర్‌ మీదుగా ఆలయానికి చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



గజ వాహనంపై గంగాగౌరి సమేత అగస్త్యేశ్వరస్వామి

## హనుమంతుడి వాహనంపై చెన్నకేశవుడు

**రాజుపాళెం :** మండలంలోని వెల్లాల బ్రహోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి హనుమంతోత్సవం కార్యక్రమంలో భాగంగా హనుమంతుడి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామి విగ్రహాలను గ్రామంలోని పురవీధుల్లో పల్లకిపై ఊరేగించారు. ముందుగా ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. చైర్మన్‌ జగదీశ్వర రెడ్డి, ఈఓ నరసయ్య, బొల్లవరం వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌ గోనా ప్రభాకర రెడ్డి, వెల్లాల ఆలయ మాజీ చైర్మన్‌ జనార్ధన్‌ రెడ్డి, జంగంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, భక్తులు స్వాముల వారిని దర్శించుకుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



హనుమంతుడి వాహనంపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామి

## గంగమ్మ జాతరలో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారుడు

**ప్రొద్దుటూరు :** ప్రొద్దుటూరు మండలం కల్లూరు గ్రామంలో బుధవారం ప్రారంభమైన గంగమ్మ జాతరకు పంచాయతీరాజ్‌ అండ్‌ రూరల్‌ డెవలప్‌మెంట్‌ ప్రభుత్వ సలహాదారుడు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి తన కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయబద్ధంగా కల్లూరు గ్రామంలో జరిగే గంగమ్మ జాతరకు తొలి రోజు తమ కుటుంబ సభ్యులు హాజరై మొదటి పూజలు చేసేవారన్నారు. తమ తల్లిదండ్రులు భాస్కర్‌రెడ్డి, కృష్ణమ్మ అనవాయితీగా ఈ కార్యక్రమం నిర్వహించేవారన్నారు. తాను ఈ ఏడాది ప్రారంభమైన గంగమ్మ జాతరకు తొలి రోజు హాజరై మొదటి పూజ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని తాను గంగమ్మ తల్లిని వేడుకున్నానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ దేశాయి శారదమ్మ, నిరంజన్‌రెడ్డి, పోతిరెడ్డి సురేఖ, శివారెడ్డి, బి.గంగయ్య, జి.సుబ్బరాయుడు, ఆవుల రాజా, ఎం.వేణుగోపాల్‌, జి.నారాయణ, బయపురెడ్డితోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



గంగమ్మకు పూజలు చేస్తున్న పోతిరెడ్డి నాగార్జునరెడ్డి

## గొప్ప సంఘ సంస్కర్త రాజారామ్మోహన్‌రాయ్‌



రాజారామ్మోహన్‌ రాయ్‌ గురించి వివరిస్తున్న జింకా సుబ్రహ్మణ్యం



గ్రంథాలయంలో విద్యార్థులకు నీతి కథలు బోధిస్తున్న దృశ్యం

**ప్రొద్దుటూరు కల్చరల్‌ :** రాజారామ్మోహన్‌ రాయ్‌ గొప్ప సంఘ సంస్కర్త అని రచయిత జింకా సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. స్థానిక వసంతపేట మున్సిపల్‌ హైస్కూల్‌లో బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో సమ్మర్‌క్యాంప్‌లో రాజారామ్మోహన్‌రాయ్‌ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలను, సతీసహగమనాన్ని వ్యతిరేకించి దురాచారాలను రూపుమాపిన మహనీయుడు రాయ్‌ అని కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్‌ ఇబ్రాంసాహెబ్‌, విశ్రాంత వైమానిక దళ అధికారి వెంకట కొండయ్య, పాఠశాల సిబ్బంది చెండ్రాయుడు, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు నీతి కథల బోధన బాల సాహిత్యం**

**చాపాడు :** చాపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం గ్రంథాలయ అధికారి శివశంకర్‌ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు నీతి కథలు వివరించారు. గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ జూన్‌ 7వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తామన్నారు. గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.